క్లుప్తంగా

గణిత అవధానికి అభినందన



తిరుపతిరావును అభినందిస్తున్న మాజీ మంత్రి అప్పలరాజు

కంచిలి: ఒకే పేజీలో రెండు విధాలుగా అందరికీ సులభంగా అర్థమయ్యేరీతిలో గణిత అవధాని మద్దు తిరుపతిరావు మాస్టర్ తయారు చేసిన 2025 సంవత్సరపు క్యాలెండర్‌ను మాజీ మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు చొట్రాయిపురం గ్రామానికి బుధవారం విచ్చేసిన సందర్భంగా పరిశీలించారు. వారం పేరు ఏ విధంగా చూడాలి, ఎలా గణన చేయాలి అనే విషయాలను అవధానిని అడిగి తెలుసుకొని అభినందించారు. ఎంపీపీ పైల దేవదాస్ రెడ్డి, పీఏసీఎస్ మాజీ అధ్యక్షుడు గుమ్మడి రామదాసు, ఏఎంసీ మాజీ అధ్యక్షుడు బదకల మోహనరావు ఉన్నారు.

వాసుదేవ బ్రహ్మోత్సవాలకు కలెక్టర్‌కు ఆహ్వానం



కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్‌కు ఆహ్వాన పత్రం అందజేస్తున్న దృశ్యం

మందస: మందసలోని వాసుదేవ పెరుమాళ్ స్వామి వార్షిక బ్రహ్మోత్సవాలు ఈ నెల 17వ తేదీ నుంచి ప్రారంభమవుతాయి. ఈ ఉత్సవాలకు హాజరు కావాలని కోరుతూ జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్‌ను కమిటీ సభ్యులు కోరారు. ఈ మేరకు ఆలయ ప్రధాన అర్చకులు కూర్మానాథస్వామి, పలాస ఎమ్మెల్యే గౌతు శిరీష, గ్రామ పెద్దలు, వికాస తరంగిణి కమిటీ సభ్యులు కలెక్టర్‌ను జిల్లా కేంద్రంలోని తన చాంబర్‌లో బుధవారం కలిసి ఆహ్వాన పత్రాన్ని అందజేశారు. కలిసి అధికారికంగా ఆహ్వానం అందజేశారు.

అధిక కేసులు రాజీ చేయాలి



న్యాయవాదులతో మాట్లాడుతున్న జడ్జి రోషిణి

టెక్కలి: జాతీయ లోక్‌అదాలత్‌లో అత్యధికంగా కేసులు రాజీ చేసే విధంగా న్యాయవాదులు సహకరించాలని టెక్కలి జూనియర్ సివిల్ జడ్జి (ఎఫ్ఏసీ) ఎం.రోషిణి విజ్ఞప్తి చేశారు. మార్చి ఎనిమిదో తేదీన జరగనున్న జాతీయ లోక్‌అదాలత్ కార్యక్రమానికి సంబంధించి బుధవారం టెక్కలి బార్ అసోసియేషన్ న్యాయవాదులతో సమావేశం నిర్వహించి పలు సూచనలు చేశారు. సమావేశంలో అసోసియేషన్ అధ్యక్షుడు డి.వి.వివేకానంద, న్యాయవాదులు కె.వెంకట్రావు, బి.కృష్ణారావు, ఎస్.రమణారావు, ఎస్.రాజన్నాయుడు పాల్గొన్నారు.

జీవితేశ్వరరావుకు మాజీ మంత్రి సంఘీభావం



జీవితేశ్వరరావుకు సంఘీభావం తెలుపుతున్న మాజీ మంత్రి అప్పలరాజు, నాయకులు

కాశీబుగ్గ: పలాస ఇందిరాచౌక్ వద్ద దివంగత ప్రధానమంత్రి ఇందిరమ్మ విగ్రహాన్ని ఏర్పాటు చేసేందుకు కృషి చేస్తున్న ప్రముఖ వైద్యుడు డాక్టర్ దువ్వాడ జీవితేశ్వరరావును విచారణ పేరుతో పోలీసులు స్టేషన్‌కు పిలిపించుకున్నారు. ఈ నేపథ్యంలో ఆయనకు అండగా ఉంటామని మాజీ మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు అన్నారు. బుధవారం కాశీబుగ్గలోని శ్రీకృష్ణ ఆస్పత్రికి వెళ్లి జీవితేశ్వరరావుకు సంఘీభావం తెలియజేశారు. పలాస–కాశీబుగ్గ మున్సిపాలిటీ, పలాస, వజ్రపుకొత్తూరు, మందస మండలాలకు చెందిన వైఎస్సార్‌సీపీ నాయకులు ఉన్నారు.

రైల్వే ఉద్యోగికి నగదు ప్రోత్సాహకం



నగదు ప్రోత్సాహకం అందుకుంటున్న అక్కుదోలాయ్ రమణ

ఇచ్ఛాపురం: ఇచ్ఛాపురం రైల్ నిలయంలో కమర్షియల్ బుకింగ్ సూపరింటెండెంట్‌గా (సీబీఎస్)గా విధులు నిర్వహిస్తున్న అక్కుదోలాయ్ రమణకు రైల్వే డీఆర్ఎం హెచ్.ఎస్.బజ్వా నగదు పురస్కారాన్ని అందజేశారు. ఇటీవల ఇచ్ఛాపురం రైల్ నిలయాన్ని ఈస్ట్‌కోస్ట్ రైల్వే జీఎం పరమేశ్వర్ ఫంక్వాల్ సందర్శించారు. ఇందులో భాగంగా రైల్ నిలయంలో ఖుర్దా డివిజన్ కమర్షియల్ అధికారులు బుకింగ్ కౌంటర్ కార్యాలయం, రికార్డులను పరిశీలించారు. బుకింగ్ కార్యాలయం, రికార్డుల నిర్వాహణ మెరుగ్గా ఉందని అభినందిస్తూ అక్కుదోలాయ్ రమణకు రూ. 5 వేలు నగదు పురస్కారాన్ని డీఆర్ఎం కార్యాలయంలో బుధవారం అందజేశారు. రైల్ నిలయం సిబ్బంది, రైలు యూజర్ కమిటీ సభ్యులు సీబీఎస్‌ని అభినందించారు.

- పరీక్షల వేళ ఆందోళన వద్దంటున్న నిపుణులు
- సమతుల్యమైన ఆహారం, సమయానికి నిద్ర అవసరం



చాకిపల్లి జెడ్పీ ఉన్నత పాఠశాలలో స్టడీ అవర్‌లో టెన్త్ విద్యార్థులు

ఒత్తిడిని జయిస్తే.. పదిలమైన ఫలితాలు

టెక్కలి: పదో తరగతి పరీక్షలకు సమయం ఆసన్నమవుతోంది. దీంతో విద్యార్థులు ఆందోళనకు గురయ్యే అవకాశం ఉంది. అయితే ఒత్తిడిని జయిస్తే పదిలమైన విజయం ఖాయమని నిపుణులు సూచిస్తున్నారు. రోజూ సమతుల్యమైన ఆహారం, సమయానికి నిద్ర, మానసిక, శారీరక ఆరోగ్యంపై తగినంత శ్రద్ధ వహిస్తే సునాయాశంగా పరీక్షలు రాయడమే కాకుండా ఎటువంటి అనారోగ్య సమస్యలకు గురి కాకుండా ఉండవచ్చునని సూచిస్తున్నారు.

టెక్కలి డివిజన్‌లో పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులు

ఈ ఏడాది మార్చి 17 నుంచి పదో తరగతి పరీక్షలు ప్రారంభం కానున్నాయి. ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 12.45 గంటల వరకు పరీక్షలు జరగనున్నాయి. టెక్కలి డివిజన్ పరిధిలో 34 కేంద్రాల్లో 6,251 మంది, పలాస డివిజన్ పరిధిలో 45 కేంద్రాల్లో 8,912 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కానున్నారు.

విద్యార్థుల కేటాయింపు ఇలా..

టెక్కలి మండలంలో ఆరు కేంద్రాలకు 968 మంది, కోటబొమ్మాళిలో ఐదు కేంద్రాల్లో 854 మంది, సంతబొమ్మాళిలో నాలుగు కేంద్రాల్లో 700 మంది, నందిగాం మండలంలో మూడు పరీక్షా కేంద్రాల్లో 320 మందిని కేటాయించారు.



ఏకాగ్రత కోసం ఇటువంటి సూర్య నమస్కారాలు ఎంతో ఉపయోగకరం

ప్రణాళికతో చదువుతున్నాం



పదో తరగతి పరీక్షల్లో మంచి మార్కులు సాధించడానికి ఇప్పటికే మా ఉపాధ్యాయులు ప్రణాళిక రూపొందించారు. ఎటువంటి ఆందోళన లేకుండా చదువుతున్నాం. ఒత్తిడిని జయించడానికి తీసుకోవాల్సిన అలవాట్ల గురించి అవగాహన కల్పించారు.

– డి.నందిని, పదో తరగతి విద్యార్థిని, బాలికోన్నత పాఠశాల, టెక్కలి

సరైన ఆహారం తీసుకోవాలి



పరీక్షల సమయంలో మంచి మార్కులు సాధించడానికి విద్యార్థులు ఒత్తిడితో కూడిన అభ్యసన చేస్తారు. కొన్ని సందర్భాల్లో సరైన ఆహారం, నిద్ర లేకుండా చదువుతారు. ఈ ప్రభావంతో పరీక్ష కేంద్రంలో ఇబ్బందులు పడతారు. అటువంటి ఇబ్బందులు లేకుండా రోజుకు ఆరు గంటల వరకు నిద్ర ఉండే విధంగా చూసుకోవాలి. సులువుగా జీర్ణమయ్యే ఆహారం తీసుకోవాలి. పరీక్షలు పూర్తయ్యే వరకు జంక్‌ఫుడ్స్‌తో పాటు అధిక కారం కలిగిన ఆహారం తీసుకోకుండా ఉంటే మంచిది. మంచినీరు అధికంగా తీసుకోవాలి. ప్రొటీన్స్, విటమిన్లు, మినరల్స్, ఫైబర్ అధికంగా ఉండే విధంగా చూసుకోవాలి.

– బీఆర్‌కే మహరాజ్, చిన్న పిల్లల వైద్యుడు, టెక్కలి

ఆందోళన వద్దు



పదో తరగతి పరీక్షలకు సంబంధించి ఇప్పటికే విద్యార్థులకు సరైన ప్రణాళిక రూపకల్పన చేశాం. ఉపాధ్యాయులతో ప్రత్యేకంగా తరగతులు నిర్వహిస్తున్నాం. ప్రతి విద్యార్థి ఉత్తీర్ణత సాధించే విధంగా ఆయా సబ్జెక్టులపై సందేహాలు నివృత్తి చేసేందుకు స్టడీ అవర్స్ నిర్వహిస్తున్నాం. అయితే విద్యార్థులు ఆందోళనతో అర్ధరాత్రి వరకు చదవకుండా సమయానికి భోజనం, నిద్ర ఉండే విధంగా తల్లిదండ్రులు దృష్టి సారించాలి. ఏ సబ్జెక్టులోనైనా సందేహాలు ఉంటే తక్షణమే ఉపాధ్యాయులను సంప్రదించాలి. పరీక్షా కేంద్రానికి గంట ముందు చేరుకుంటే ఎటువంటి ఆందోళన ఉండదు.

– పి.విలియమ్, ఉప విద్యా శాఖాధికారి, టెక్కలి

సూర్య నమస్కారాలు చేయాలి



పరీక్షలంటేనే విద్యార్థులు తీవ్రమైన ఒత్తిడికి గురవుతారు. దీన్ని అధిగమించేందుకు పిల్లలు రోజూ సూర్యోదయానికి మునుపు సూర్య నమస్కారాలు, ప్రాణాయామం చేయడం ఎంతో మంచిది. దీని వలన ఏకాగ్రత పెరగడమే కాకుండా చదివిన విషయాలు గుర్తుంటాయి. మానసిక స్థైర్యం ధృడంగా ఉంటుంది. అత్యధికంగా బలాన్నిచ్చే.. సులువుగా జీర్ణమయ్యే ఆహారం తీసుకోవడం ఆరోగ్యకరం.

– జి.చంద్రశేఖర్, యోగా గురువు, టెక్కలి

అందుబాటులో గుండెపోటుకు ఉచిత ఇంజక్షన్



మాట్లాడుతున్న డాక్టర్ రాంజీ

కవిటి: రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు గుండెపోటుకు గురయ్యేవారు గంట వ్యవధిలో వస్తే ఉచితంగా రూ.45 వేలు విలువైన ఇంజక్షన్‌ను వేసి ప్రాణాన్ని కాపాడుతామని కవిటి సీహెచ్‌సీ సూపరింటెండెంట్ డాక్టర్ పి.రాంజీ చెప్పారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. ఛాతినొప్పి, ఎడమ భుజం లాగడం, ఆకస్మిక ఆయాసం, గుండె దడ, స్పృహ కోల్పోవడం వంటివి గుండె పోటు లక్షణాలన్నారు. ఇలాంటి లక్షణాలు ఆకస్మికంగా వస్తే గంట సమయంలో కవిటి సామాజిక ఆస్పత్రికి చేరుకుంటే అత్యవసర వైద్యంలో భాగంగా ఈసీజీ పరీక్షలు నిర్వహిస్తామన్నారు. ఆ రిపోర్టును పరిశీలించి కచ్చితంగా తేడా ఉంటే టెనిక్టేప్లాస్–40 ఎంజీ ఇంజక్షన్‌ను ఉచితంగా ఇస్తామన్నారు. ఈ ఇంజక్షన్‌ను ప్రభుత్వం ఉచితంగానే సరఫరా చేస్తుందన్నారు. గుండె పోటు వచ్చిన తర్వాత గోల్డెన్ అవర్‌గా భావించే తొలి గంట సమయంలోనే ఈ ఇంజక్షన్ వేయాల్సి ఉంటుందన్నారు. ఇంజక్షన్ వేసిన తర్వాత 108 వాహనంలో శ్రీకాకుళంలోని గుండె చికిత్సలు అందించే ఆస్పత్రికి రోగిని పంపిస్తామన్నారు. ఇప్పటి వరకు స్థానిక సామాజిక ఆస్పత్రి పరిధిలో ఏడుగురికి ఈ ఇంజక్షన్ వేసినట్టు పేర్కొన్నారు. దీంతో పాటు పాముకాటుకు కూడా ఇంజక్షన్ అందుబాటులో ఉందన్నారు.

ప్రీఫైనల్ పరీక్షల పరిశీలన



విద్యార్థితో మాట్లాడుతున్న ఎంఈవో అప్పారావు

ఇచ్ఛాపురం టౌన్: స్థానిక మున్సిపల్ బాలికోన్నత పాఠశాలలో జరుగుతున్న పదో తరగతి ప్రీఫైనల్ పరీక్షలను ఎంఈవో కె.అప్పారావు బుధవారం పరిశీలించారు. భయం లేకుండా పరీక్షలను రాస్తే మెరుగైన ఫలితాలు వస్తాయని విద్యార్థులకు సూచించారు. శతశాతం ఉత్తీర్ణత సాధించే దిశగా విద్యార్థులను సమాయత్తం చేయాలని ఉపాధ్యాయులకు సూచించారు. అనంతరం మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. సీఆర్ఎంటీ ఆర్.దేవరాజు ఉన్నారు.

విజయగౌరిని గెలిపించండి

నందిగాం: యూటీఎఫ్ బలపర్చిన పీడీఎఫ్ అభ్యర్థి కొండెండ్ల విజయగౌరిని ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీగా మొదటి ప్రాధాన్యతా ఓటు వేసి గెలిపించాలని యూటీఎఫ్ నాయకులు కోరారు. బుధవారం యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శులు బి.లక్ష్మీరాజా, కోటేశ్వరఅప్పి, ఎస్.జయచంద్రరెడ్డిలు మండలంలోని పలు ఉన్నత పాఠశాలలు, కేజీబీవీలు, ఆశ్రమ పాఠశాలలు, ప్రభుత్వ జూనియర్ కాలేజీను సందర్శించి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. యూటీఎఫ్ ప్రతినిధులు బాలక శంకరరావు, కె.దాలయ్య, పి.ధర్మారావు, కె.కుమారస్వామి, వైకుంఠరావు ఉన్నారు.

కళాకారులను గౌరవించుకుందాం



జానకిరామ్‌రెడ్డిని సత్కరిస్తున్న నాయకులు

ఇచ్ఛాపురం రూరల్: సమాజానికి అవసరమైన మానసిక ఉల్లాసాన్ని, అహ్లాదాన్ని కలిగిస్తున్న కళాకారులను గౌరవించడం, సత్కరించడం మన సంప్రదాయమని ఎంపీపీ బోర పుష్ప అన్నారు. వైఎస్సార్‌సీపీ నాయకుడు, కళాకారుడు రంగాల జానకిరామ్‌రెడ్డి ఇటీవల తెలుగుబుక్ ఆఫ్ రికార్డ్ నంది పురస్కారం అందుకున్న నేపథ్యంలో బుధవారం ఎంపీపీ కార్యాలయం ఆవరణలో మండల పార్టీ నాయకులు ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. శాస్త్రీయ, జానపద రంగాల్లో విశిష్ట సేవలు అందించే కళాకారులు ఇచ్ఛాపురం నియోజకవర్గంలో వందలాది మంది ఉన్నారని, ప్రభుత్వం వారిని ఆదుకోవాలని అన్నారు. అనంతరం ప్రముఖ జానపద కళాకారుడు, మహతీ సాంస్కృతిక సేవా సంఘం ప్రధాన కార్యదర్శి తిప్పన ధనుంజయరెడ్డిని సత్కరించారు. వైస్ ఎంపీపీ దువ్వు వివేకానందరెడ్డి, మాజీ ఎంపీపీ కారంగి మోహనరావు, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు దక్కత నూకయ్యరెడ్డి, మండల వైఎస్సార్‌సీపీ కన్వీనర్ పాతిర్ల రాజశేఖరరెడ్డి, సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ పలాస అధ్యక్షుడుగా దువ్వాడ రవి



నూతన అధ్యక్షుడు రవిని అభినందిస్తున్న నాయకులు

పలాస: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ పలాస మండల కమిటీ అధ్యక్షునిగా అల్లుకోల గ్రామానికి చెందిన దువ్వాడ రవిని కార్యకర్తలు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కాశీబుగ్గ ప్రగతిభవన్‌లో బుధవారం నాయకులు, కార్యకర్తల సమావేశం బుధవారం జరిగింది. మాజీ మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో రవిని అధ్యక్షునిగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తనపై నమ్మకంతో మండల అధ్యక్షునిగా బాధ్యతలు అప్పగించినందుకు మాజీ మంత్రి అప్పలరాజుకు కృతజ్ఞతలు తెలియజేశారు. పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు పైల చిట్టి, పార్టీ నాయకుడు ఉంగ సాయిక్రిష్ణ, జిల్లా అధికార ప్రతినిధి బమ్మిడి దుర్యోధనరావు, పలాస సర్పంచుల సంఘం అధ్యక్షుడు కొర్ల సంతోష్, సీనియర్ నాయకుడు బొడ్డు సుధాకర్, రాపాక చిన్నారావు, బత్తిన హేమేశ్వరరావు, సైని దేశయ్య, సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు పాల్గొన్నారు.

విద్యుత్ కార్మికుల సమస్యలపై పోరాటం



వేడుకల్లో యూనియన్ సభ్యులు

టెక్కలి: విద్యుత్ ఉద్యోగులు, కార్మికుల సమస్యలపై అలుపెరగని పోరాటం చేస్తామని విద్యుత్ ఎంప్లాయిస్ 1104 యూనియన్ నాయకులు ఎస్.లోకేశ్వరరావు, డి.శేఖర్, జి.రాజారావు అన్నారు. బుధవారం టెక్కలి యూనియన్ కార్యాలయంలో 75 సంవత్సరాల వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా యూనియన్ పతాకాన్ని ఆవిష్కరించారు. అనంతరం స్థానిక జిల్లా ప్రభుత్వ ఆస్పత్రిలో సత్యసాయి నిత్యాన్నపూర్ణ కార్యక్రమం ద్వారా అన్నదానం చేశారు. కార్యక్రమంలో కె.గిరీశ్వర్‌రావు, ఎ.గోపాల్‌రత్నం, ప్రసాద్ పాణిగ్రహి, ఎం.హిమగిరి ఉన్నారు.

అగ్నికుల క్షత్రియ సంఘానికి సామగ్రి వితరణ



వంటపాత్రలను అందజేస్తున్న దృశ్యం

పలాస: బొడ్డపాడు గ్రామ అగ్నికుల క్షత్రియ సంఘానికి అదే గ్రామానికి చెందిన గేదెల చిన్నారావు జ్ఞాపకార్థం అతని కుటుంబ సభ్యులు రూ.50 వేలు విలువైన వంట పాత్రలు, ఇతర సామగ్రిని బుధవారం అందజేశారు. చిన్నారావు కళాకారుడుగా, అండమాన్ జగదీశ్వర సంఘం నామ ప్రధాతగా అనేక సేవా కార్యక్రమాలు చేశారు. కార్యక్రమంలో కుల నాయడు పోతనపల్లి లక్ష్మణరావు, ప్రధాన కార్యదర్శి బొడ్డు దుష్యంతు, బుడత ధనరాజ్, బొడ్డు మోహన్‌రావు, బొడ్డు సింహాద్రి, తామాడ రామారావు, బత్తిన వాసదేవు, బొడ్డు జగన్, కుత్తుం హేమలయ్య, గర్తం కూర్మారావు ఉన్నారు.

అమ్మవారి జాతర



కంచిలి మండలం కొనక గ్రామంలో వెలసిన కురాసిని అమ్మవారి జాతర వైభవోపేతంగా బుధవారం జరిగింది. వేకువజాము నుంచి ఆంధ్రా–ఒడిశా గ్రామాలకు చెందిన భక్తులు అమ్మవారిని దర్శించుకొని మొక్కులు తీర్చుకున్నారు. బుధవారం ఉదయం ఏడు గంటలకు ప్రారంభమైన జాతర గురువారం ఉదయం వరకు జరుగుతుంది. మధ్యాహ్నం భక్తులకు అన్నదానం చేశారు. జా కార్యక్రమాలు నిర్వహించనున్నారు.

– కంచిలి

క్రీడాకారుడికి సత్కారం



తమిళనాడు రాష్ట్రం చెన్నైలో జరిగిన జాతీయ స్థాయి టెన్నికాయిట్ పోటీల్లో పలాసకు చెందిన కొవ్వూరు ప్రవీణ్‌కుమార్ వ్యక్తిగత విభాగంలో రాణించాడు. పోటాపోటీగా తలపడి నాలుగో స్థానంలో నిలబడ్డాడు. ఈ సందర్భంగా పలాస–కాశీబుగ్గ మున్సిపాలిటీ పరిధి విద్యావాహిణి జూనియర్ కళాశాలలో ఇంటర్ చదువుతున్నందున ప్రవీణ్‌కుమార్‌ను కళాశాల సిబ్బంది బుధవారం సత్కరించారు. ప్రిన్సిపాల్ పైల తిరుమల, అధ్యాపకులు ప్రవీణ్‌కుమార్, పైల మన్మథరావు పాల్గొన్నారు.

– కాశీబుగ్గ

సంక్రమాణ పూజలు



మాఘ పౌర్ణమితో పాటు కుంభ సంక్రమాణం కావడంతో బుధవారం దేవాలయాల్లో భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఉద్దానం ప్రాంతానికి చెందిన సంగీత కళాకారులతో కచేరీలు నిర్వహించారు. అధికసంఖ్యలో భక్తులు ఆలయాలకు వెళ్లి పూజలు చేశారు. కొఠారీ శివాలయంలో జరిగిన సంగీత కచేరీ భక్తులను అలరించింది.

– ఇచ్ఛాపురం రూరల్

ఆలయ వార్షికోత్సవం



నందిగాం మండలం కణితూరులోని కొత్తమ్మతల్లి ఆలయ 22వ వార్షికోత్సవం బుధవారం ఘనంగా జరిగింది. ఉదయం విఘ్నేశ్వరపూజ, పుణ్యాహవచనం, రక్షాసూత్రధారణ, అమ్మవారికి పంచామృతాభిషేకం, విశేష అర్చనలు, లక్ష కుంకుమార్చన, లలితా హోమం, పూర్ణాహుతి, వేదస్వస్తి, ఆశీర్వచనం తదితర కార్యక్రమాలు శాస్త్రోక్తంగా నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్నప్రసాద వితరణ చేశారు. వైఎస్సార్‌సీపీ టెక్కలి ఇన్‌చార్జి పేరాడ తిలక్ కుటుంబసభ్యుల ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో పలువురు నాయకులు పాల్గొన్నారు.

– నందిగాం

ఖాళీ స్థలాలపై ఆక్రమణదారుల కన్ను!



ఈదుపురం రోడ్డు పక్కన వెలసిన షెడ్

ఇచ్ఛాపురం రూరల్: ఖాళీగా ఉన్న స్థలాలపై అక్రమార్కుల కన్నుపడుతోంది. అధికారులను ప్రసన్నం చేసుకోవడం, స్థలాలపై అధికారం చెలాయించడం ఇచ్ఛాపురంలో నిత్యకృత్యంగా మారింది. ఈదుపురం బహుదా వంతెన నుంచి ఇచ్ఛాపురం బెల్లుపడ జంక్షన్ వరకు బహుదానదీ పరివాహక ప్రాంతం తారు రోడ్డుకు ఆనించి ఉన్న ఖాళీ స్థలాల్లో కట్టడాలు వెలుస్తున్నాయి. స్థానిక పెట్రోల్ బంక్‌కు ఎదురుగా ఇటీవల ఈదుపురం గ్రామానికి చెందిన ఓ నాయకుడు దర్జాగా వ్యాపారం కోసం షెడ్‌ను నిర్మించడం పట్ల పలువురు విస్మయం చెందుతున్నారు. ఈ కట్టడం అక్రమమా.. సక్రమమా అన్నది రెవెన్యూ అధికారులు తేల్చాలని స్థానికులు కోరుతున్నారు.

ఇంటింటి సర్వే చేయాలి



సమావేశంలో జడ్జిలు కిశోర్‌బాబు, శ్రీనివాసరావు

సోంపేట: లీగల్ సర్వీసెస్ అథారిటీ తరఫున టీం సభ్యులు ఈ నెల 24వ తేదీ నుంచి రోజూ డోర్ టు డోర్ క్యాంపెయిన్ నిర్వహించి సర్వే చేయాలని మండల లీగల్ సర్వీసెస్ కమిటీ అధ్యక్షుడు, ఆరవ అదనపు జిల్లా జడ్జి కె.కిషోర్‌బాబు అన్నారు. స్థానిక కోర్టు హాల్ ప్రాంగణంలో సోంపేట సీనియర్ సివిల్ జడ్జి జె.శ్రీనివాసరావుతో కలిసి మండల లీగల్ సెల్ ఆధ్వర్యంలో ఇంటిగ్రేటెడ్ టీం సభ్యులతో బుధవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ క్యాంపెయిన్‌లో ప్రతి రోజు ఎన్ని ఇళ్లు విజిట్ చేసింది తెలియజేయాలని, అక్కడ కొత్తగా పుట్టిన పిల్లలు, అంగవైకల్యం ఉన్నవారు ఎవరైనా ఉన్నారా, బాల్యవివాహాలు చేయడం వలన కలిగే అవరోధాలు గురించి ప్రజలకు అవగాహన కల్పించాలని అన్నారు. సమావేశంలో మేనేజర్ ఎ.వెంకట్, అప్పలనాయుడు, టీం సభ్యులు, న్యాయవాదులు పాల్గొన్నారు.

సంక్షిప్తంగా..

16న వ్యాసరచన, వక్తృత్వ పోటీలు

కాశీబుగ్గ: పలాస శ్రీరామక్రిష్ణా సేవా సంఘం 65వ వార్షికోత్సవం సందర్భంగా హైస్కూల్ స్థాయి విద్యార్థులకు ఈ నెల 16న వ్యాసరచన, వక్తృత్వ పోటీలు నిర్వహిస్తున్నట్టు సంఘ సభ్యులు బుధవారం తెలిపారు. ఆసక్తి ఉన్నవారు 99663 60178, 94915 69453 నంబర్లను సంప్రదించి పేర్లను నమోదు చేయించుకోవాలన్నారు. స్వర్ణోత్సవ భారత రాజ్యాంగ సాఫల్య, వైఫల్యాలపై వ్యాసరచన, యువతను నిర్వీర్యం చేస్తున్న మాదకద్రవ్యాల నిర్మూలనలో సమాజం, ప్రభుత్వ పాత్ర అనే అంశంపై వక్తృత్వ పోటీలు ఉంటాయన్నారు. వీటిపై విద్యార్థులు సిద్ధం కావాలని అన్నారు. ప్రవేశ రుసుం లేదని, పేపర్లను సైతం సరఫరా చేస్తామన్నారు. మొదటి మూడు స్థానాల్లో నిలిచిన వారికి బహుమతులు అందజేస్తామన్నారు.

ఇంటర్న్‌షిప్‌కు ఆదిత్య విద్యార్థులు ఎంపిక

టెక్కలి: హైదరాబాద్ కేంద్రంగా యంత్ర ఇన్ఫర్మేషన్ సిస్టమ్స్ కంపెనీలో ఇంటర్న్‌షిప్‌కు ఆదిత్య ఇంజినీరింగ్ కళాశాలకు చెందిన కంప్యూటర్ సైన్స్, ఐటీ విద్యార్థులు ఇప్పిలి జాహ్నవి, పాయల చరణ్ ఎంపికైనట్లు కళాశాల డైరెక్టర్ వి.వి.నాగేశ్వరరావు బుధవారం తెలిపారు. నాలుగు నెలల ఇంటర్న్‌షిప్ తరువాత అదే కంపెనీలో రూ. ఆరు నుంచి రూ. ఎనిమిది లక్షల వరకు వార్షిక ప్యాకేజీ జీతంతో ఉద్యోగం అందజేస్తారని వెల్లడించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ ఎ.ఎస్.శ్రీనివాసరావు, హెచ్‌ఓడీలు వై.రమేష్, బి.రమేష్‌నాయుడులు విద్యార్థులను అభినందించారు.

అధిక ధరలకు మద్యం విక్రయిస్తే చర్యలు

టెక్కలి: మద్యం దుకాణాల్లో ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా అధిక ధరలకు అమ్మకాలు చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని టెక్కలి ఎక్సైజ్ సీఐ షేక్ మీరాసాహేబ్ హెచ్చరించారు. బుధవారం 'సాక్షి'లో వెలువడిన పాత స్టాక్...కొత్త ధరలు కథనంపై పట్టణంలో గల మద్యం దుకాణాలను తనిఖీ చేశారు. కొత్త స్టాకుకు మాత్రమే ప్రభుత్వం పెంచిన మద్యం ధరలు వర్తిస్తాయని సీఐ స్పష్టం చేశారు.

ద్విచక్ర వాహనాన్ని ఢీకొట్టి పరార్..

కాశీబుగ్గ: పలాస–కాశీబుగ్గ మున్సిపాలిటీ నెమలి నారాయణపురం వద్ద జాతీయ రహదారిపై బుధవారం ప్రమాదం చోటుచేసుకుంది. మందస మండలం బాలిగాం గ్రామానికి చెందిన గున్న శ్రీను ద్విచక్ర వాహనంపై వస్తుండగా ఎదురుగా వచ్చి కారు ఢీకొట్టింది. దీంతో ద్విచక్ర వాహనదారుడు కిందపడిపోయి గాయపడ్డాడు. అయితే ప్రమాదానికి కారణమైన కారును డ్రైవర్ ఆపకుండానే పరారయ్యాడు. క్షతగాత్రుడుని చికిత్స కోసం పలాస ప్రభుత్వ సామాజిక ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసిన పోలీసులు పరారైన కారు కోసం గాలిస్తూ సీసీ ఫుటేజీ సేకరణలో ఉన్నారు.

పారిశుద్ధ్య కార్మికుల మస్టర్ పరిశీలన

కాశీబుగ్గ: మున్సిపాలిటీ పరిధి పలాస కొత్తవీధిలో పారిశుద్ధ్య కార్మికుల మస్టర్‌ను కమిషనర్ నడిపేన రామారావు బుధవారం పరిశీలించారు. అనంతరం మూడు రోడ్ల కూడలి, 14వవార్డు పరిసర ప్రాంతాలలో పారిశుద్ధ్య పనులు పరిశీలించారు.

సారా కలిగిఉన్న ముగ్గురు అరెస్ట్

సోంపేట: సోంపేట ఎక్సైజ్ సర్కిల్ పరిధి మందస మండలంలో సీఐ కె.బేబీరాణి ఆధ్వర్యంలో బుధవారం దాడులు నిర్వహించారు. ముగ్గురు వ్యక్తుల నుంచి 48 లీటర్ల సారాను స్వాధీనం చేసుకొని వారిపై కేసులు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు. బుడార్సింగి పంచాయతీ కళింగదల్‌లో నెయ్యిల కేశవరావు నుంచి 20 లీటర్లు, బెల్లుకోల గ్రామానికి చెందిన సవర భీమారావు వద్ద 14.5 లీటర్లు, బాహడాపల్లిలో రత్నాల శకుంతల నుంచి 14.5 లీటర్ల సారాను స్వాధీనం చేసుకొని అరెస్టు చేశామన్నారు.

మృతుల కుటుంబాలకు పరామర్శ

సోంపేట: సోంపేట మండలం జింకిభద్ర గ్రామానికి చెందిన సాహుకారి ఢిల్లేశ్వరరావు మద్యం మత్తులో తన భార్య రత్నాలును గొడ్డలితో ఇటీవల హతమార్చాడు. ఈ విషయం తెలుసుకున్న సోంపేట జెడ్పీటీసీ సభ్యురాలు తడక యశోద, పలాసపురం సర్పంచ్ తడక జోగారావులు బాధిత కుటుంబాన్ని బుధవారం పరామర్శించారు. అలాగే కుత్తుం గ్రామానికి చెందిన ఎంపీటీసీ మాజీ సభ్యుడు కీలు సత్యం సోదరి గౌరకల రోహిణమ్మ చనిపోవడంతో ఆమె కుటుంబాన్ని కూడా పరామర్శించి సంతాపం తెలియజేశారు.

డ్వాక్రా సంఘాలను బలోపేతం చేద్దాం

కంచిలి: సెర్ప్ నిబంధనలను పాటిస్తూ డ్వాక్రా సంఘాలను బలోపేతం చేయడానికి అన్నిస్థాయిల్లో కృషి చేద్దామని ఐకేపీ ఏపీఎం ఎస్.ప్రసాదరావు అన్నారు. కేసరపడ గ్రామ సంఘం సమావేశంలో బుధవారం ఆయన మాట్లాడారు. సంఘ సమావేశాలు సక్రమంగా నిర్వహించుకోవాలని, అన్ని సంఘాలు గ్రేడ్-ఏ లో ఉండాలని, ఆదాయ అభివృద్ధి కార్యక్రమాలకు ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. సీసీ ప్రమీల, వీవోఏ భాస్కరరావు పాల్గొన్నారు.

వైద్యఖర్చులకు ఆర్థికసాయం

ఇచ్ఛాపురం: మున్సిపాలిటీ పరిధి కొండపోలమ్మ కాలనీకి చెందిన ప్రతిభాత్రిపాఠి వృద్ధ దంపతులు అనారోగ్యంతో బాధపడుతున్నారు. కుమారుడు కూడా అనారోగ్యంతో మృతి చెందారు. విషయం తెలుసుకున్న సోషల్ రెస్పాన్స్‌బిలిటీ ఆర్గనైజేషన్ సభ్యులు ఏడు వేలు సేకరించారు. ఈ మొత్తాన్ని వృద్ధ దంపతులకు వైద్య ఖర్చుల నిమిత్తం బుధవారం అందజేశారు. స్వచ్ఛసంస్థ ప్రతినిధులు ధనుష్‌రంగా, రాజ్‌కుమార్, నరేంద్ర పాల్గొన్నారు.